


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.10 (310.3558)	68,210	43,230
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (3.96)	2,724	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.27 (41.63)	13,643	16,000

చికెన్ ధరలు | లైవ్: రూ.130 | డ్రెస్: రూ.190 | స్కిన్‌లెస్: రూ.216



యాదాద్రి థర్మల్ ప్లాంట్

కొత్త ఏడాదిలో యాదాద్రి వెలుగులు

రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ వేగంగా సిద్ధమవుతోంది. ఒక్కో ఘట్టాన్ని విజయవంతంగా పూర్తిచేస్తున్న అధికారులు ప్లాంట్ నుంచి విద్యుదుత్పాదన చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ చేస్తున్నారు. బుధవారం కీలకమైన రెండో యూనిట్ సింక్రనైజేషన్ ప్రక్రియను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న ఈ విద్యుత్ కేంద్రం నుంచి తొలిదశలో ఈ ఏడాది డిసెంబరు నాటికి మూడు యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మిగిలిన రెండు యూనిట్లు కలిపి మొత్తం 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు పనులు కొనసాగుతున్నాయి.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

- డిసెంబరు నెలాఖరుకు 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- నిర్వాసితులకు ఉద్యోగాలిస్తామని ఉపముఖ్యమంత్రి హామీ
- పర్యావరణ అనుమతులొచ్చాక వేగవంతమైన పనులు
- ప్లాంట్ పనులతో సమాంతరంగా రైల్వేలైన్ నిర్మాణం
- వచ్చే ఏడాది మార్చి నాటికి ప్లాంట్ మొత్తం సిద్ధం

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో తొలుత 50శాతం విదేశీ బొగ్గు, మరో 50శాతం స్వదేశీ బొగ్గును వినియోగిస్తామని ప్రభుత్వం ప్రకటించగా, అనంతర కాలంలో మొత్తం స్వదేశీ బొగ్గుతో నిర్వహిస్తామని వెల్లడించింది. దీంతో ఈ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పర్యావరణవేత్తలు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసువేశారు. ఈ కేసుతో పర్యావరణ అనుమతులను కేంద్ర పర్యావరణ సంస్థ నిలిపివేసి, మళ్లీ ప్రజాభిప్రాయసేకరణ చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20న ప్రజాభిప్రాయసేకరణ చేపట్టి నివేదించడంతో ఈ కేసును గ్రీన్‌ట్రిబ్యునల్ కొట్టివేసింది. ఫలితంగా కేంద్ర పర్యావరణ సంస్థ ఈ ఏడాది జూలై 5న అనుమతులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ప్లాంట్ పనులు ఊపందుకున్నాయి. రాష్ట్ర ఇంధనశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రతీ వారం అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహిస్తూ పనుల పురోగతికి లక్ష్యం విధించారు. దీంతో పనుల్లో వేగం పెరిగింది. మొత్తం ఐదు యూనిట్లకు మొదటి రెండు యూనిట్లలో ఇప్పటికే లైటప్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. తాజాగా, బుధవారం రెండో యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 30న మొదటి యూనిట్‌లోనూ సింక్రనైజేషన్ ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. రెండో యూనిట్‌లో కీలకమైన బొగ్గు మండించే ప్రక్రియను చేపట్టడం ద్వారా ఈ యూనిట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బాయిలర్‌ని సిద్ధం చేసే ప్రక్రియను అక్టోబరు 5న, అక్టోబరు 15న మొత్తం రెండో యూనిట్ ట్రయల్ ఆపరేషన్ చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మొదటి యూనిట్‌లో ఈనెల 30న సింక్రనైజేషన్ చేసి, అక్టోబరు 25న బొగ్గు మండించే ప్రక్రియ, 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బాయిలర్‌ను సిద్ధం చేసే ప్రక్రియను చేపట్టి, అక్టోబరు 30న మొత్తం మొదటి యూనిట్ ట్రయల్ రన్ నిర్వహించనున్నారు.

● నాలుగో యూనిట్‌లో ఈ నెల 25న బాయిలర్ లైటప్ ప్రక్రియ, నవంబరులో స్టీమ్ బ్లోయింగ్, డిసెంబరు 15న సింక్రనైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ ఏడాది డిసెంబరులో బొగ్గును మండించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, డిసెంబరు నెలాఖరుకు పూర్తిస్థాయి ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు.

● మూడో యూనిట్ బాయిలర్ లైటప్ ప్రక్రియ అక్టోబరు 10న, స్టీమ్ బ్లోయింగ్ ప్రక్రియ డిసెంబరులో, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సింక్రనైజేషన్, బొగ్గు మండించి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, అదే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు ట్రయల్ ఆపరేషన్ పూర్తిచేస్తారు.

● ఐదో యూనిట్‌లో ఈ ఏడాది డిసెంబరు 15న బాయిలర్ లైటప్ చేపట్టనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో స్టీమ్‌బ్లోయింగ్ ప్రక్రియ, ఫిబ్రవరిలో సింక్రనైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తారు. మార్చిలో బొగ్గు మండించి విద్యుత్ ఉత్పత్తి నిర్వహించడంతో పాటు, అదే నెలలో ట్రయల్‌రన్ చేపట్టి మొత్తం ప్లాంట్‌లో అన్ని యూనిట్లను విద్యుత్ ఉత్పత్తికి సిద్ధం చేయనున్నారు.

నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని డిప్యూటీ సీఎం ఆదేశం

రాష్ట్ర ప్రగతి కోసం తరతరాలుగా తమ కుటుంబాలకు ఆదరువైన భూములు ఇచ్చిన త్యాగధనులను ప్రభుత్వం గుర్తిస్తుందని, వారి కుటుంబాలకు అర్హతల మేరకు ఇదే ప్లాంటులో ఉద్యోగాలిచ్చేందుకు కార్యాచరణ చేపట్టాలని జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్, ఇతర ఉన్నతాధికారులకు ఇక్కడి నుంచే ఆదేశాలిస్తున్నట్లు బుధవారం థర్మల్ ప్లాంట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియను ప్రారంభించిన అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. నిర్వాసితులకు ఉద్యోగాలిచ్చే అంశంపై ఆయన ఆదేశాలివ్వడంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేయడంతో పాటు, అధికారులు ఈ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా భూనిర్వాసితులందరికీ ఉద్యోగాలొస్తాయని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. మంత్రుల ఆదేశాలతో నిర్వాసితులకు ఊరట కలిగింది. ప్లాంట్ కోసం 4,676 ఎకరాల భూమిని సేకరించగా, సుమారు 1,560 కుటుంబాలకు చెందిన వారికి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్లాంట్ ప్రారంభోత్సవానికి ముందే జాబ్‌కార్డులు ఇచ్చి, ఆయా ఉద్యోగాలకు శిక్షణ కూడా ఇవ్వాలని జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం, మంత్రులు ఆదేశించారు. పెండింగ్ పరిహారం, ఇళ్లు కోల్పోయిన కపూర్‌తండా, మోదుగులకుంటతండాలకు చెందిన గిరిజన కుటుంబాలకు ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు.



యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో సింక్రనైజేషన్‌ను ప్రారంభిస్తున్న భట్టి

వచ్చే నెలాఖరుకు రైల్వేలైన్ పనులు పూర్తి

యాదాద్రి థర్మల్‌పవర్‌ప్లాంట్‌లో కీలకమైన రైల్వే ట్రాక్ నిర్మాణపనులు కూడా ప్లాంట్ నిర్మాణ పనులకు సమాంతరంగా వేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్లాంట్‌కు ఏడాదికి 12.29మిలియన్ యూనిట్ల బొగ్గు అవసరమవుతుందని అంచనా. రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే తక్కువ రవాణా వ్యయంతో బొగ్గును అందుబాటులోకి తెచ్చుకునే వెసులుబాటు ఉంటుందనే అంచనాతో ఈ పనుల్లో వేగం పెంచారు. సగటున నెలకు ఒక మిలియన్ యూనిట్ల బొగ్గు ఇక్కడ అవసరం. ఈ బొగ్గును పూర్తిస్థాయిలో సింగరేణి గనుల నుంచే తీసుకోవాలని తాజాగా నిర్ణయించారు. బొగ్గును రవాణా చేసే నిమిత్తం ప్లాంట్ వద్దకు విష్ణుపురం నుంచి ప్రత్యేకంగా రైల్వేలైన్ ఏర్పాటుచేస్తున్నారు. ఈ పనులు ప్రస్తుతం చివరిదశకు చేరాయి. నాలుగు బ్రిడ్జిలున్న చోట్ల మినహా మిగిలిన ట్రాక్ పనులు మొత్తం పూర్తయ్యాయి. ప్లాంట్ వద్ద ఎక్స్‌చేంజ్‌యార్డు పనులు ప్రస్తుతం కొనసాగుతుండగా, బ్రిడ్జిల వద్ద ట్రాక్ పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటితో పాటు జాన్‌పహాడ్ నుంచి విష్ణుపురం వరకు రైల్వేట్రాక్ పనులు పూర్తవగా, జాన్‌పహాడ్ స్టేషన్ పనులు పూర్తయ్యాయి. రైల్వేశాఖ ఈ మార్గంలో నిర్వహించాల్సిన సైట్ యాక్సెప్టెన్సీ టెస్ట్‌కు రంగం సిద్ధం చేశారు. ఈ ప్లాంట్‌కు ప్రత్యేకంగా రెండు లోకోమోటివ్‌లను ఇప్పటికే సైట్ వద్దకు చేర్చారు. ఈ నెలాఖరులోగా రైల్వేశాఖ నుంచి ట్రాక్ సర్టిఫికెట్, క్లియరెన్స్ వస్తుందని అధికారులు భావిస్తున్నారు. అక్టోబరు 1నుంచి సింగరేణి గనుల నుంచి బొగ్గు తరలించేందుకు అవసరమైన అనుమతులు మంజూరయ్యాయి. మొత్తంగా రైల్వేట్రాక్ పనులు పూర్తిచేయడంతో పాటు ఇక్కడికి బొగ్గు తరలించేందుకు ప్లాంట్ వద్ద అవసరమైన పనులన్నీ పూర్తవుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరుకు ముందే అంటే నవంబరు మొదటి వారానికే ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని జెన్‌కో అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

త్రిపురారం, సెప్టెంబరు 11: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం త్రిపురారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆస్పత్రిలో ఓపీ సేవలు పొందుతున్న ప్రజలను వివరాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు రోగులకు ఇంజక్షన్లు వేయడం, సెలైన్ బాటిల్స్ ఎక్కించడం చేస్తున్నారని, అలాంటి వారు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 140 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రతీ చిన్న జ్వరాన్ని డెంగీ జ్వరంగా చూపిస్తున్నారని, ఇలాంటి చర్యలు మానుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా కొన్ని మండలాల్లో కీళ్ల నొప్పులతో కూడిన విష జ్వరాలు వస్తున్నాయని, బాగా కాచి, చల్లార్చిన నీరు తాగడం, విశ్రాంతి తీసుకోవడం ద్వారా జ్వరం తగ్గుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతావాణి, డాక్టర్ రమావత్ శంకర్‌నాయక్, సీహెచ్‌వో మాతంగి వెంకటయ్య, సూపర్‌వైజర్ పుట్ట గోపాల్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకన్న, ఏఎన్ఎంలు నూర్జహన్, లలిత ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి మూసీ రెండో విడత నీటి విడుదల

కేతేపల్లి, నాగార్జునసాగర్, సెప్టెంబరు 11: మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వ ఆయకట్టుకు గురువారం నుంచి నీటిని విడుదల చేయనున్నారు. ఈ మేరకు డ్యాం అధికారులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయకట్టుకు మొదటి విడతగా గత జూలై 25 నుంచి ఆగస్టు 18 వరకు 25 రోజులు విడుదల చేయాల్సి ఉన్నా, రైతుల విజ్ఞప్తి మేరకు అదనంగా మరో 15 రోజులు నీటిని విడుదలచేశారు. రెండో విడత ఈ నెల 3వ తేదీ నుంచి నీటి విడుదల చేయాల్సి ఉండగా, వర్షాల కారణంగా దాదాపు 10 రోజులు వాయిదా వేశారు. రెండో విడత నీటిని ఈ నెల 12 నుంచి నెలాఖరు వరకు విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం కలిగిన మూసీ ప్రాజెక్టు బుధవారం సాయంత్రానికి 643.50 అడుగులకు చేరింది. ఇదిలా ఉండగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక క్రమంగా 68,210 క్యూసెక్కుల తగ్గడంతో ప్రాజెక్టు మొత్తం 26 గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, బుధవారం సాయంత్రానికి 589.10 అడుగులుగా(310.3558టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టు నుంచి మొత్తంగా 43,230 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

కోదాడకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- జీవో నెం.731 ద్వారా రూ.10కోట్లు మంజూరు
- ఫలించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి కృషి
- వీలైనంత వేగంగా అందుబాటులోకి తెస్తాం : మంత్రి



నల్లగొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కోదాడ: కోదాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో నెం.731 విడుదల చేసింది. ఈ సెంటర్ నిర్మాణానికి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ రూ.10కోట్ల నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ ఈ కేంద్రాన్ని కోదాడలో ఏర్పాటు చేయనుంది. పారిశ్రామిక, ఆటో మొబైల్ రంగానికి కేంద్రమైన కోదాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయించాలనే లక్ష్యంతో నీటిపారుదల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించి కోదాడకు ఈ సెంటర్ దక్కింది. ఈ కేంద్రం ఏర్పాటయితే ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతోపాటు చేస్తున్న ఉద్యోగాల్లో ప్రమోషన్లకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నైపుణ్య సాధనతో జాబ్ గ్యారంటీతో నిరుద్యోగ యువత కుటుంబాలకు ఊరట కలగడంతో పాటు, అదే సమయంలో సామాజిక వృద్ధికి దోహదపడుతుంది. శాస్త్ర, సాంకేతికంగా వస్తున్న మార్పులను యువత అందిపుచ్చుకునేందుకు ఈ సెంటర్లు దోహదపడతాయన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రాల్లో నైపుణ్య శిక్షణ పొందడం ద్వారా అకడమిక్ క్వాలిఫికేషన్ ఉన్న యువతకు మరింత మెరుగైన వేతనాలతో ఉద్యోగాలు దక్కుతాయి. అకడమిక్ విద్యలేకపోయినా, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు డ్రాపవుట్ విద్యార్థులకు సైతం వారికి తగిన వృత్తుల్లో ఇక్కడ శిక్షణ లభిస్తుంది. తద్వారా వారి జీవనోపాధికి మెరుగైన అవకాశాలు దక్కుతాయి. 1998లో స్థాపించబడిన ఎన్ఏసీ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్) ఇప్పటివరకు దేశంలో దాదాపు 5లక్షల మంది నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణను అందించిందని, అందరికీ తగిన ఉపాధి అవకాశాలు దక్కాయని సంస్థ రికార్డుల్లో పేర్కొంది. అలాంటి సంస్థ కోదాడలో రూ.10కోట్లతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావడం ఇక్కడి నిరుద్యోగ యువతకు ఒక చక్కటి అవకాశమని, వీలైనంత వేగంగా ఇక్కడ ఈ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తమవంతు కృషి చేస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పేర్కొన్నారు.

వైద్యులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న మాతృనాయక్

దేవరకొండ, సెప్టెంబరు 11: విధుల్లో నిర్లక్ష్యంవహిస్తే వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులను పరామర్శించి వైద్యం సక్రమంగా అందుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. రక్తనిధి కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి 100 పడకల నుంచి 200 పడకల ఆస్పత్రిగా ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. వంద పడకల ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతుందని, త్వరలో సూపరింటెండెంట్‌తోపాటు అనస్తీషియా డాక్టర్లు, శస్త్రచికిత్స వైద్యుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు పెరిగిపోతున్నాయని, దీంతో ప్రతీరోజు ప్రభుత్వ ఆస్పత్రికి ఓపీ 700 నుంచి 800వరకు రోగులు వస్తున్నారన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ నెల 7న ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవంకోసం వచ్చిన ఇస్లావత్ జ్యోతికి మగశిశువు జన్మించాడు. శిశువు అనారోగ్యానికి గురికావడంతో డ్యూటీ డాక్టర్ బాబురాం వైద్య పరీక్షలు నిర్వహించడంలో నిర్లక్ష్యం చేశారని, దీంతో శిశువు మృతి చెందాడని జ్యోతి బంధువులు కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డాక్టర్ బాబురామ్‌కు మెమో జారీ చేసినట్లు మాతృనాయక్ తెలిపారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

వైద్య, ఆరోగ్య శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండలోని న్యూ రెయిన్‌బో ఆస్పత్రిని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వైద్యులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అదే విధంగా దేవరకొండ పట్టణంలోని పలు ఆస్పత్రులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు.

‘వైటీపీఎస్’ కాపర్ దొంగల అరెస్ట్

- రూ.26లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ, సెప్టెంబరు 11: మండల పరిధిలోని వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లో నాలుగేళ్లుగా కాపర్ వస్తువులను చోరీ చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.26లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వెల్లడించారు. బుధవారం ఉదయం మిర్యాలగూడ ఈదులగూడెంలో పాతఇనుము విక్రయించే వ్యాపారి పగడాల బాలరాజు దుకాణం వద్ద సాత్‌తండాకు చెందిన వ్యవసాయ కూలీలు గుగులోతు రఘు, గుగులోతు రాముడు, దుబ్బతండాకు చెందిన కొర్ర శివ, తాళ్ల వీరప్పగూడెం కిరాణ వ్యాపారి చెన్నబోయిన నాగయ్య, మిర్యాలగూడకు చెందిన పాతఇనుము వ్యాపారులు బత్తుల జానకిరాములు, పగడాల బాలరాజు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు ఆధ్వర్యంలో టూటౌన్, రూరల్ సీఐల నేతృత్వంలో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వైటీపీఎస్‌లో కాపర్ వస్తువులను దొంగిలించి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వైటీపీఎస్ పరిసర గ్రామాలైన తాళ్లవీరప్పగూడెం, సాత్‌తండా, దుబ్బతండా, వీర్లపాలెం గ్రామాలకు చెందిన వ్యక్తులు పవర్‌స్టేషన్‌లోకి అక్రమంగా ప్రవేశించి వైటీపీఎస్ నిర్మాణ సంస్థ బీహెచ్ఈఎల్ కంపెనీ స్టోర్ యార్డ్‌లో అన్‌లోడ్ చేసిన కాపర్ వస్తువులు సెక్యూరిటీ లేని సమయం చూసి దొంగిలించి తాళ్లవీర్పగూడెం బెల్ట్‌షాప్ నిర్వాహకులు పెండెం భాస్కర్ ఇంట్లో దాచి ఉంచుతున్నట్లు తెలిపారు. భాస్కర్ మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాతఇనుము వ్యాపారులు మేకల శ్రీను, పగడాల బాలరాజుతో కలిసి వాటిని హైదరాబాద్‌కు తరలించి పలు దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు తెలిసిందన్నారు. దీంతో ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.26లక్షల నగదు, ఆటో, రెండు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో మేకల శ్రీనుపై దామరచర్ల, మిర్యాలగూడలో పలు కేసులు నమోదయ్యాయని, హిస్టరీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నేరస్తులను గుర్తించి పట్టుకున్న టూటౌన్ సీఐ నాగార్జున, రూరల్ సీఐ వీరబాబు, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, వాడపల్లి ఎస్ఐ, టూటౌన్ ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు, పాల్గొన్నారు.

తండ్రి చేతిలో కుమారుడి హతం

సూర్యాపేట, సెప్టెంబరు 11 : మద్యానికి బానిసై తరుచూ వేధిస్తున్న కుమారుడిని తండ్రి హతమార్చాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం కొత్తతండా పరిధిలోని బాపూజీతండాలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధిస్తున్న కుమారుడు బానోత్ కిరణ్(37)ని అతడి తండ్రి పంతులు గొడ్డలితో దాడి చేసి హతమార్చినట్లు స్థానికులు తెలిపారు. కిరణ్ తన తండ్రిని తరుచూ డబ్బులు ఇవ్వాలంటూ వేధిస్తూ ఉండేవాడని, బుధవారం సాయంత్రం భార్య బంధువుల ఇంటికి వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రి పంతులుతో కిరణ్ మద్యంమత్తులో గొడవపడినట్లు స్థానికులు తెలిపారు. విసిగివేసారిన తండ్రి పంతులు పక్కన ఉన్న గొడ్డలితో కిరణ్‌పై దాడి చేయడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సైదులు, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి క్లూస్‌టీంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంతులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కిరణ్‌కు భార్య సౌజన్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పంతులు వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తుండగా, కిరణ్ మద్యానికి బానిసై ఏపనీ చేయడం లేదు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఐదుగురు బాలురకు గాయాలు

చివ్వెంల, సెప్టెంబరు 11: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో పిచ్చికుక్కదాడిలో ఐదుగురు బాలురు గాయపడ్డారు. చందుపట్ల(బీ) గ్రామంలో ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆరుబయట ఆడుకుంటున్న శిగ జశ్విత్, కాసాని సోన్విత్, సిద్దోజు వివేక్‌లు సాయంత్రం సమయంలో ఆడుకుంటున్నారు. అదే సమయంలో గ్రామంలో కొద్దిరోజులుగా తిరుగుతున్న పిచ్చికుక్క బాలుర్‌పై దాడి చేసింది. అనంతరం ఎస్సీ బాలుర హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు బయట నిల్చోగా వారిపై దాడిచేసింది. పిచ్చికుక్క దాడిలో మొత్తం ఐదుగురు బాలురకు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు.

అదుపు తప్పిన ప్రైవేట్ పాఠశాల బస్సు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 11: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలో డ్రైవర్ అప్రమత్తతతో ప్రైవేట్ పాఠశాల బస్సుకు ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో 30మంది విద్యార్థులున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చింతలపాలెం మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులను మండల కేంద్రానికి తీసుకువస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు బుధవారం మండల కేంద్రానికి సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన ఉన్న డైవర్షన్ రోడ్డులో అదుపుతప్పింది. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రధాన రహదారిని నిలిపివేసిన అధికారులు రైల్వేట్రాక్ పక్కన డైవర్షన్ రోడ్డును తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. ఇటీవలి భారీవర్షాలకు రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసమైంది. డైవర్షన్ రోడ్డులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. భారీ గుంతల నుంచి తప్పించబోయిన డ్రైవర్ రోడ్డు పక్కగా బస్సు నడిపాడు. పూర్తిగా బురదమయమైన రోడ్డు నుంచి బస్సు టైర్లు ఒక్కసారిగా జారి పక్కన ఉన్న పొలాల సరిహద్దులోకి వెళ్లింది. టైర్లు బురదలో కూరుకుపోయి బస్సు నిలిచిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు నిదానంగా వెళ్తుండటం, డ్రైవర్ అప్రమత్తతతో బస్సును వెంటనే నిలిపివేసి విద్యార్థులను కిందకు దింపాడు. అటుగా వెళ్తున్న స్థానిక రైతులు ట్రాక్టర్ల సహాయంతో బస్సును బయటకులాగారు. అనంతరం స్కూల్ ఆటోల్లో విద్యార్థులను తరలించారు.



బురదలో చిక్కుకున్న బస్సును లాగేందుకు ఏర్పాట్లు చేస్తున్న స్థానికులు

మహిళా స్వావలంబనలో 'స్వరభారతీ'

● తుర్కపల్లి, భువనగిరి మండలాల్లో నిర్వహణ ● నేడు సొసైటీ రజతోత్సవాలు

గ్రామీణ మహిళలకు ఆర్థికభరోసాతో పాటు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు పిలుపు స్వచ్ఛంద సంస్థ చేపట్టిన కార్యాచరణ ఎంతో మంది జీవితాలను మలుపుతిప్పింది. మూడు దశాబ్దాల కిందట గ్రామీణ మహిళలు ప్రతీ అవసరానికి ఇంటి యజమానులపై ఆధారపడే పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో వారికి ఎదురయ్యే సమస్యలను చర్చించుకోవడంతో పాటు ఆర్థికస్వేచ్ఛ కోసం నెలకొన్నదే సంస్థ పిలుపు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్వరభారతీ మ్యాక్స్ సొసైటీ ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది. పిలుపు సంస్థ వ్యవస్థాపకులు ఎం.జనార్ధన్ ఆలోచనలోంచి 1993లో పుట్టిన ఈ సంస్థ ఎంతోమందిని మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. నింపుతోంది.

-తుర్కపల్లి



గ్రామగ్రామాన తిరిగి పేద మహిళలను సమావేశపర్చి వారి పరిస్థితులను విశదీకరించి, పొదుపు పరపతి అవశ్యకతను తెలిపి, వారి అభీష్టంతో రూ.10తో పొదుపు పరపతి మొదలుపెట్టారు. ఏడాదిలో 250 మంది సభ్యులుగా చేరారు. ఎన్నో ఆటుపోట్లను నిష్టూరాలను ఎదుర్కొన్నారు. పిలువు సంస్థ ఆధ్వర్యంలో 1997 ఆగస్టు నాటికి 9 గ్రామాల్లో 1,026 మంది సభ్యులతో కలిపి స్వరభారతీ పేరున అన్‌రిజిస్టర్ సొసైటీగా రూపొందింది. ఇందులో ఓ సంస్థకు ఉన్నట్లుగానే జనరల్ బాడీని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత రెండేళ్లకు 1999 మార్చిలో తొమ్మిది గ్రామాలు 1,026 మంది సభ్యులతో కూడిన మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు పరపతి సంఘం లిమిటెడ్ పేరున 1995 మ్యాక్స్ చట్టం కింద స్వరభారతీ మ్యాక్స్ పేరుతో రిజిస్టర్ చేశారు.

వడ్డీ తగ్గిస్తూ.. పొదుపుపై వడ్డీ చెల్లిస్తూ

పిలువు సంస్థకు 1999-2003 దశలో గ్రామపంచాయతీ 100 గజాల భూమిని విరాళంగా ఇవ్వగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)ఆర్థిక సహకారంతో సొంత భవనాన్ని నిర్మించుకున్నారు. మరోపక్క ఒక్కో గ్రామానికి విస్తరిస్తూ 2023 నాటికి 17 గ్రామాలు 1,238 మంది సభ్యులకు సంస్థ చేరుకుంది. చేసుకున్న పొదుపు ద్వారా సభ్యుల అవసరాల మేరకు రుణసహాయం పొంది బతుకుదెరువులను మెరుగుపర్చుకోవడం మొదలుపెట్టారు. సభ్యులకు అందించే రుణాలపై 24శాతం వడ్డీ వసూలు చేస్తూ 12 శాతం వారి పొదుపులో జమచేస్తున్నారు. గ్రామాలన్నింటినీ మూడు క్లస్టర్లుగా ఏర్పాటుచేసి ముగ్గురు ఉద్యోగులను నియమించి సంఘాల నిర్వహణ బాధ్యలను అప్పగించారు. వారికి నిర్వహణపై శిక్షణ అందించారు. 2008లో జరిగిన మ్యాక్స్ వార్షిక సమావేశంలో అప్పులపై వడ్డీని 18శాతానికి తగ్గించి ఇందులో 90శాతం సభ్యుల పొదుపులపై చెల్లించడం ప్రారంభించారు.

ఆదాయంతో పాటు ఆహారం



రామోజీనాయక్‌తండాలో స్వరభారతీ ఏర్పాటుచేసిన ఇందిరా బృందంలో 1999లో సభ్యురాలిగా చేరా. మా తండాలో ఇంతకు ముందు జొన్నలు, సజ్జలు బాగా పండించేవారు. కానీ ఐదేళ్ల నుంచి జొన్న సాగు మానేశారు. ఈ సంగతి మా బృందంలో చర్చించుకొని తిరిగి జొన్న పంటను పునరుద్ధరించాలని తీసుకున్న నిర్ణయం మేరకు జొన్న సాగు చేస్తున్నా. అందుకు అనుబంధంగా వ్యాపార పంటైన బంతిని కూడా వేశా. దీంతో మా కుటుంబసభ్యులకు పౌష్టికాహారం లభిస్తుంది, జొన్న సాగు చేసే వారికి పెట్టుబడి సాయం కూడా ఇస్తున్నారు. ఈ పంటల సాగుతో కొంత ఆదాయం పౌష్టికాహారం లభిస్తోంది.

-గుగులోతు అంబి, రామోజీనాయక్‌తండా

బ్యాంకుల రుణసాయం

2009-2013 మధ్యలో 20గ్రామాల్లోని 2,843 మంది సభ్యులను 206 బృందాలుగా స్టేట్ బ్యాంక్ వారి సహకారంతో ఏర్పాటు చేసి, బృందాల పేరున బ్యాంక్ ఖాతాలను తెరిచి అప్పటివరకు సమకూరిన పొదుపులు, పొదుపులపై చెల్లించిన వడ్డీని ఖాతాల్లో జమచేశారు. అప్పటి నుంచి బృందాలస్థాయిలో సభ్యుల సమష్టి నిర్ణయం మేరకు ఆర్థిక లావాదేవీలు ప్రారంభమయ్యాయి. ఈ బృందాలకు మ్యాక్స్ వారి పూచీకత్తుపై హెచ్‌డీఎఫ్‌సీ నుంచి రూ.1.30కోట్లు, ఎస్‌బీఐ తుర్కపల్లి నుంచి రూ.2కోట్ల రుణసాయం అందాయి. వలస పోయిన వృద్ధులు సభ్యత్వాలను విరమించుకున్నారు. ఎప్పటికప్పుడు ఈ బృందాలను పర్యవేక్షిస్తూ అవసరమైన పద్ధతులను రూపొందించుకొని నిరంతరం సంఘ సమావేశాల్లో పాల్గొని సభ్యులను జాగృతం చేసి ముందుకు సాగారు. లెక్కల్లో తప్పొప్పులను సరిచేసుకుంటూ బుక్‌కీపర్లకు తగిన శిక్షణ ఇచ్చారు. కేవలం ఆర్థిక లావాదేవీలే కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, మహిళా, పేదల సమస్యలపై పనిచేయడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా 2018 నుంచి బుక్‌కీపర్లకు బృందాల ఆర్థిక పరిపుష్టిని బట్టి రూ.500 నుంచి రూ.300 వరకు రుసుం చెల్లిస్తున్నారు. మిగులు లేని బృందాలకు ఉచితసేవ అందిస్తున్నారు. భవిష్యత్‌లో పిలువు సంస్థ లేకపోయినా స్వరభారతీ మ్యాక్ ఈ ప్రాంతాల్లోని మహిళలకు అండగా ఉంటుందని భరోసా ఇక్కడి మహిళల్లో కనిపిస్తోంది.

ఖర్చులు పోనూ రూ.10 వేల ఆదాయం

ఇంతకు ముందు పౌల్ట్రీఫాం ఉండేది. దాంతో వచ్చే ఆదాయం అవసరాలకు సరిపోయేదికాదు. భావన పొదుపు బృందం నుంచి చిన్నమొత్తాల్లో చాలాసార్లు అప్పు తీసుకొని కుటుంబ అవసరాలు తీర్చుకున్నా.ఇప్పుడు రూ.70వేల అప్పు తీసుకుని జిరాక్స్ మిషన్ పెట్టుకున్నా. ఖర్చులన్నీ పోను నెలకు రూ.10వేల వరకు ఆదాయం వస్తుంది. స్వరభారతికి ధన్యవాదాలు.

వలందాసు లావన్య, రుస్తాపూర్



2024 మార్చి నాటికి

గ్రామాలు :	14
సభ్యులు :	2,089
బృందాలు :	166
పొదుపులు :	రూ.4.73కోట్లు
మిగులు :	రూ.1.24కోట్లు

ఈ నెల 12న స్వరభారతీ రజితోత్సవాలు

పిలువు స్వచ్ఛంద సంస్థ సహకారంతో 1995లో స్వరభారతీ మ్యాక్స్ సొసైటీ రిజిస్ట్రేషన్ అయ్యింది. సొసైటీ ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 12న రజతోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరవుతున్నట్లు మ్యాక్స్ మేనేజర్, బోర్డు అధ్యక్షురాలు సుమలత తెలిపారు.

● భవిష్యత్‌లో మరింత ముందుకు



30ఏళ్లుగా నడుస్తున్న స్వరభారతీ మ్యాక్స్ తమ అనుభవాలను తీసుకుని భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో సమాజంలో పేదలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఆ దిశగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నా.

ఎం.జనార్థన్, పిలుపు సంస్థ ఎగ్జిక్యూటీవ్, డైరక్టర్

● సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం సంతోషం



గత 25 ఏళ్లుగా స్వరభారతీ మాక్స్ ద్వారా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం తనతో పాటు గ్రూప్ సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- కొడారి సుమలత, స్వరభారతీ మ్యాక్స్ అధ్యక్షురాలు

ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తా



స్వరభారతీ మ్యాక్స్ ప్రారంభం నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్నా. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తూ బోర్డు, బుక్‌కీపర్ల సమావేశాలు నిర్వహిస్తా. అంతే కాకుండా గ్రామస్థాయిలోని బృందాల ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుంటా. రాబోయే తరం యువతులు స్వరభారతీలో కీలకపాత్ర తీసుకుని ముందుకు నడిపించాలని ఆకాంక్షిస్తున్నాం.

- జీ లక్ష్మి, స్వరభారతీ మ్యాక్స్ మేనేజరు

బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే ఉద్యమం ఉధృతం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 10 : పంచాయతీ రాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని, లేకుంటే ఉద్యమ ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీపీ మండల్ 106 జయంతిని పురస్కరించుకొని బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదురుగా బీపీ మండల్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఆ మేరకు హామీని నిలబెట్టుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబరు నెలాఖరు వరకు జరుపుతామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం ముందుగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో కులగణన చేసి, రిజర్వేషన్లు పెంచాలన్నారు. అందుకోసం మూడు నెలలుగా ఉద్యమాలు చేస్తున్నాం, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇక రాహుల్‌గాంధీ అయినా స్పందించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతారా లేదా ప్రకటన చేయాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అందుకు విరుద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో బీసీ నేతలు జెండాలు మోసుకుంటు, జిందాబాద్‌లు, బానిసలుగా మారారని, ఇకనైనా ఆ బతుకులకు స్వస్తి చెప్పి ప్రభుత్వంపై ఒత్తిడి కోసం చేసే పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ సవరణ చేయాలి సుప్రీంకోర్టు ప్రకారం తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదన్నారు. ఇప్పటికే అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టి 50శాతం సీలింగ్‌పై పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేసిందన్నారు. ఆ అగ్రకులాలకు రిజర్వేషన్లను పెంచడానికి మూడు రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభలో రాజ్యాంగ సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారు కానీ 50 శాతం జనాభా గల బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా ఇదేం న్యాయమని ప్రశ్నించారు. రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ పార్టీ తన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజారాంయాదవ్, సంఘం జిల్లా అధ్యక్షుడు దూకుడుకు లక్ష్మీ నారాయణ, నీల వెంకటేశం, పిల్లి రామరాజు, వంగూరి నారాయణయాదవ్, ప్రసన్న, శిరందాసు రామదాసు, సత్తయ్య, సర్వాల వెంకన్న, అల్లి వేణు, మామిడి పద్మ, సింగం లక్ష్మీ, కొండూరు సత్యనారాయణ, గోవర్ధన్, గద్దె నాగరాజు, సతీష్ యాదవ్, వల్లేకీర్తి శ్రీనివాస్, మచ్చ గిరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఎదగాలంటే బీజేపీ రావాలి

● మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్



గిరిజన మహిళకు సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ ఈటల

రామగిరి, సెప్టెంబరు 11: తెలంగాణ రాష్ట్రం గొప్పగా ఎదగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అవినీతి, కుటుంబపాలన లేని పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీ పాలన మాత్రమేనని అన్నారు. దేశం అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వాన్ని తీసుకొని దేశ భవిష్యత్‌కు నాంది పలకాలన్నారు. దేశం కోసం, ధర్మం కోసం పని చేసే పార్టీ కూడా బీజేపీనే అని అన్నారు. ప్రతీ బూత్‌లో సభ్యత్వ నమోదును విరివిగా చేసి రాష్ట్రంలోనే జిల్లాను ముందుంచాలని కార్యకర్తలు పిలుపునిచ్చారు. ప్రజలకు బీజేపీ మీద విశ్వసం ఉంది కాబట్టే నరేంద్రమోదీని మూడోసారి కూడా గెలిపించుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరెళ్లి చంద్రశేఖర్, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, గోలి మధుసూదన్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య తదితరులు ఉన్నారు. నల్లగొండలోని పాతబస్తీలో ఏర్పాటుచేసిన ఒకటో నెంబర్, 19వవార్డులో ఏర్పాటు చేసిన వినాయకులను ఈటల దర్శించుకున్నారు.

● ఆర్టీసీ పెన్షనర్లకు ఈపీఎఫ్ డిమాండ్ లేఖలు ఇప్పించాలని ఆర్టీసీ పింఛన్‌దారులు దాసోజు శేఖరాచారి, వీఎస్‌పి రావు, పీవై రెడ్డి, దశరథ కోరారు.



ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షన్‌దారులు

పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎలా ఉంది?



చిట్యాల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో డాక్టర్లు

చిట్యాల, సెప్టెంబరు 11: పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఎలా ఉంది? ఇమ్యూనైజేషన్ ప్రక్రియ ఎలా ఉంది, ఫలితాలు ఎలా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థకు (డబ్ల్యూహెచ్‌వో) చెందిన వైద్యులు ఎస్.అనూష, డేవిడ్ ఆరా తీశారు. బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డబ్ల్యూహెచ్‌వో వైద్యుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలో అందుతున్న సేవలు, ఇమ్యూనైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఎంత మందికి టీకాలు(ఇమ్యూనైజేషన్) వేశారు? వాటి ఫలితాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.పద్మ మాట్లాడుతూ టీకాలు వేయించుకుంటే 14రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని దోమలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎస్‌పీవో కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది నర్సింగరావు, ఉదయ్‌రాజు తదితరుల పాల్గొన్నారు.

గొంతుకోసి యువకుడి హత్య



కిరణ్(ఫైల్‌ఫొటో)

నాగారం, సెప్టెంబరు 11: పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో బుధవారం ఉదయం వెలుగుచూసింది. యువకుడి మృతదేహాన్ని ఎస్సారెస్పీ కాల్వలో పడేయడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మునిసిపాలిటీకి చెందిన వనగండ్ల కిరణ్‌కుమార్(27) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో తిరుమలగిరి పరిధిలోని హిల్స్‌కాలనీ నుంచి బైక్‌పై వెళ్తున్నాడు. కిరణ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి అతడిపై కత్తులతో దాడి చేశారు. స్పృహకోల్పోయిన కిరణ్‌ను కారులో నాగారం మండలం డీ.కొత్తపల్లి గ్రామశివారులోని ఎస్సారెస్పీ కాల్వ వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక కిరణ్‌ను గొంతుకోసి చంపారు. మృతదేహాన్ని కాల్వలో పడవేసి దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారని సీఐ తెలిపారు. బుధవారం ఉదయం కాల్వ వెంట పొలాలకు వెళ్తున్న స్థానికులకు కాల్వలో యువకుడి మృతదేహం కనిపించిందన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పంచనామా నిర్వహించినట్లు సీఐ తెలిపారు. కిరణ్‌కుమార్ అవివాహితుడు కాగా అతడి సోదరుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. త్వరలో దుండగులను పట్టుకుని హత్యకు దారితీసిన కారణాలను ప్రకటిస్తామన్నారు. సంఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ జీ రవి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం, ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలు సేకరించాయి.

హత్యకు వివాహేతర సంబంధమేనా కారణమా?

దుండగుల దాడిలో చేతిలో హత్యకు గురైన కిరణ్‌కుమార్‌కు తిరుమలగిరికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉందని అనుమానిస్తున్నారు. ఈ విషయంలో కిరణ్‌తో గతంలో ఓ వ్యక్తి గొడవ పడినట్లు సమాచారం. మృతుడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఫత్తేపురం విజయ్‌తో గతంలో గొడవపడ్డాడని,అతడే తన తమ్ముడిని హత్య చేశాడని అనుమానం వ్యక్తం చేశాడు. ఆ దిశగా విచారణ చేసి, నేరస్తులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

దుండగులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో



తిరుమలగిరిలో రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

తిరుమలగిరి : తిరుమలగిరికి కేంద్రానికి చెందిన కిరణ్‌ను కిరాతంగా హత్యచేసిన దుండగలను వెంటనే అరెస్ట్ చేయాలని కుటుంబసభ్యులు తిరుమలగిరి పట్టణంలో ఆందోళన చేశారు. జనగామ- సూర్యాపేట రహదారిపై అంబేద్కర్‌నగర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్‌లు ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు. అంబేద్కర్‌నగర్‌లో పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటుచేశారు.

లారీ క్యాబిన్ నుంచి పడి క్లీనర్ మృతి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 11 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో లారీ క్యాబిన్ నుంచి పడి క్లీనర్ మృతి చెందాడు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మండలం దుబ్బతండాకు చెందిన జాటోత్ నెహ్రూ(30) లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. తమ్ముడు శరత్ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా మేళ్లచెర్వు మండలంలో సిమెంట్ లోడ్ కోసం మంగళవారం రాత్రి హుజూర్‌నగర్ బైపాస్ రోడ్డులో లారీలో వెళ్తున్నారు. ఆ సమయంలో నెహ్రూ క్లీనర్ ప్లేస్‌లో కూర్చొని లారీ డోర్ వేసేందుకు ప్రయత్నించి కిందపడగా లారీ టైర్లు అతడి మీది నుంచివెళ్లాయి. దీంతో నెహ్రూ అక్కడికక్కడే మృతి చెందాడు. నెహ్రూ తండ్రి హనుమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 11 : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పేరేపల్లిలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన పోలోజు వెంకటాచారి(50) తన నివాస సమీపంలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ ఐర్ తగిలి బుధవారం రాత్రి కిందపడిపోయాడు. కొద్దిసేపటికి అతడిని వినాయక మంట నిర్వాహకులు గమనించే సరికి మృతి చెందాడు. విషయాన్ని స్థానికులకు, కుమారుడు శంకరాచారికి తెలిపారు. వెంకటాచారి భార్య ఐదేళ్ల కిందట మృతి చెందగా వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



వైటీపీఎస్ విద్యుదుత్పత్తి యూనిట్

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్

పనులు చకచకా

దామరచర్ల, సెప్టెంబరు 11 : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్) పనులు చకచకా సాగుతున్నాయి. బుధవారం రెండో యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఆయన వెంట జిల్లా మంత్రులు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉన్నారు. ఇప్పటికే మొదటి యూనిట్‌లో సింక్రనైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. మొదటి, రెండో యూనిట్‌కు సంబంధించిన పనులను అధికారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది డిసెంబరు నాటికి విద్యుదుత్పత్తిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.



విద్యుదుత్పత్తి యూనిట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి





విద్యుదుత్పత్తి యూనిట్‌లోని విద్యుత్ మోటార్లు, ఇతర యంత్రాలు



యూనిట్ 2 ప్రవేశమార్గం



విద్యుదుత్పత్తిని మానిటరింగ్ చేసే కాన్ఫరెన్స్‌హాల్

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : రాజగోపాల్‌రెడ్డి



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, సెప్టెంబరు 11: నియోజకవర్గంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మిషన్ భగీరథ గ్రిడ్ పనుల తీరు సంబంధిత అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో జనాభా పెరుగుదలకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు కేటాయించాలని సూచించారు. ఏ కాలమైనా నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా నీటి కేటాయింపులు జరగలేదన్నారు. సమస్య పరిష్కారానికి మోటార్ల కెపాసిటీ పెంచాల్సి ఉంటుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తేగా అందుకు ఆమోదం తెలుపుతూ అవసరమైన ప్రతిపాదనలను తయారు చేసి పంపాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి : బాలునాయక్



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 11: విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులను ఆదేశించారు. దేవరకొండ పట్టణంలోని 8వ వార్డులో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 8వ వార్డులో కొద్ది రోజులుగా నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్య ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పరిష్కారమైందని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, విద్యుత్ ఏడీ సైదులు, కౌన్సిలర్ జయప్రకాష్‌నారాయణ, శ్రీశైలంయాదవ్, దేవేందర్‌నాయక్, వెంకటేశ్వర్లు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీపై గణేష్ విగ్రహం



ట్రాక్టర్ ట్రాలీపై ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

దామరచర్ల, సెప్టెంబరు 11: అడవిదేవులపల్లి మండలంలోని నల్లమెట్టతండా గ్రామపంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ట్రాలీపై వినాయక చవితి సందర్భంగా కొందరు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఐదు రోజులుగా పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని వీధుల్లో చెత్తను సేకరించడానికి ప్రభుత్వం అందించిన ట్రాక్టర్ ట్రాలీపై వినాయకుడి విగ్రహాన్ని కొందరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు నెలలుగా చెత్తను సేకరించకుండా ట్రాక్టర్‌ను నిరుపయోగంగా వదిలేశారని ఆరోపించారు. గ్రామానికి సంబంధించిన అధికారులు పారిశుధ్య పనులను పట్టించుకోకపోవడంతో తాము తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గణేష్‌మార్కెట్‌లో కొలువుదీరిన భారీ వినాయకుడిని దర్శించుకునేందుకు పట్టణ, పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 39వ వార్డు, అశోక్‌నగర్‌లలో నిర్వహించిన పూజలకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరయ్యారు.

'రైతులను రోడ్డెక్కించిన ఘనుడు సీఎం'

కేతేపల్లి, సెప్టెంబరు 11: తెలంగాణ రైతాంగాన్ని రోడ్డు ఎక్కించిన ఘనుడు సీఎం రేవంత్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలో ఏనాడూ రైతులు రోడ్డెక్కిన దాఖలాలు లేవన్నారు. దగాపూరిత వాగ్దానాలు, దొంగమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అన్యాయమే చేసిందని విమర్శించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బి.స్వర్ణలత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కె.ప్రదీప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు యాదగిరి, చేతన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు

● **నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**



చిట్యాల మండలం ఏపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 11: చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడమేకాకుండా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం ఏపూర్‌లో రూ. 10లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో లావణ్య, ఏసీడీపీవో వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి దేశబోయిన మలేశం, విజేత, అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

హాలియా: గర్భిణులు తప్పనిసరిగా సమతుల పోషకాహారం తీసుకోవాలని హాలియా మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమ నరేందర్‌రెడ్డి, జిల్లా శిశు సంక్షేమ అధికారి (డీడబ్ల్యూవో) సక్కుబాయి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సీడీపీవో ఉదయశ్రీ అధ్యక్షతన అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని డెలివరీలు జరిగేలా అంగన్‌వాడీ టీచర్లు ప్రోత్సహించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ, ఏసీడీపీవో సువర్ణ, డీసీ సతీష్, రమాదేవి, సరిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గట్టుప్పల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో లావణ్యకుమారి అన్నారు. గట్టుప్పల్ మండల పరిధిలోని వెలమకన్నె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్ శివేశ, రాము, లింగయ్య, పరమేశం, సున, నరసింహ, బేగం తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించడంతో పాటు పలు వ్యాధులు దరి చేరకుండా కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. మండలంలోని బుగ్గబావిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందే చిరుధాన్యాలు, ఆకు కూరలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, పంచాయతీ కార్యదర్శి సబిత, అంగన్‌వాడీ టీచర్లు రోజా, పద్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ ప్రతిజ్ఞ చేశారు. బాలామృతం, పోషకాహారం, ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజలి, సరిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కట్టంగూరు: కట్టంగూరు మండలంలోని గార్లబాయిగూడెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు పోషణమాసం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో అస్రాఅంజుమ్, సూపర్‌వైజర్ శారదరాణి, పాఠశాల హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయులు సునీత, అనిత, మహిళలు పాల్గొన్నారు.

కనగల్: పోషకాహారంతోనే ఆరోగ్య పరిపుష్టి కలుగుతుందని సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని జీఎడవల్లి, తేలకంటిగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించి కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పోషకాహార ఆవశ్యకతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. అనంతరం ర్యాలీలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఎల్‌హెచ్‌పీ మహేశ్వరి, ఏఎన్‌ఎం బాలథెరిస్సా, అంగన్‌వాడీ టీచర్లు సునీత, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్కీం బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

నల్లగొండరూరల్, సెప్టెంబరు 11: భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని, సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అమలుచేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద బీమా, సహజ మరణం, శాశ్వత పాక్షిక అంగవైకల్యం తదితర సంక్షేమ పథకాలను బీమా కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తోందని ఆరోపించారు. ఆ విధానాన్ని విరమించుకోకపోతే కార్మికవర్గ ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటలను చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 12నుంచి 15వ తేదీ వరకు సంతకాల సేకరణ, 16న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 19, 20, 21 తేదీల్లో అడ్డా పని ప్రదేశాల్లో సమావేశాలు, 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భైరం దయానంద అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు అద్దంకి నరసింహ, పి.సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకులు జిట్ట నగేష్ పాల్గొన్నారు.

ఈటల సమక్షంలో బీజేపీలో పలువురి చేరిక



పార్టీ సభ్యత్వం తీసుకుంటున్న చొక్కారావు, కండువా కప్పుకుంటున్న నాగార్జునరెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 11: మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ జాతీయ నాయకుడు ఈటల రాజేందర్ సమక్షంలో బుధవారం డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు 50 మంది అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా చొక్కారావు మాట్లాడుతూ ఎంపీ ఈటెల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో పాటు ఇతర నాయకుల సమక్షంలో బీజేపీ సభ్యత్వం తీసుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. నల్లగొండ పట్టణంలోని 34వ వార్డు బీఆర్ఎస్ ఇన్‌చార్జి దోనాల నాగార్జునరెడ్డి బీజేపీలో చేరారు. ఆయనకు ఎంపీ ఈటల కాషాయ కండువా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గొంగిడి మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, పిల్లి రామరాజుయాదవ్‌తో పాటు పెండ్యాల దామోదర్‌రావు, పరమేష్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎంపీ రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరినట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాదినేని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తుమ్మపల్లి హన్మంతరెడ్డి, ఐల శ్రీనివాసగౌడ్, సంకబుడ్డి వెంకటయ్య, చిత్రియాల రమేష్, సుంకరి సాయి, నరేష్, ఏడుకొండలు, పురుషోత్తంరెడ్డి, రవి, పోరెడ్డి పాల్గొన్నారు.

ఆహార పదార్థాల విక్రయాల్లో పరిశుభ్రత పాటించాలి

● **మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, సెప్టెంబరు 11: ఆహార పదార్థాల విక్రయాల్లో పరిశుభ్రత పాటించాలని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం వీధి విక్రయదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశుభ్రమైన ఆహార పదార్థాలను విక్రయిస్తూ వినియోగదారుల మనస్సును చూరగొనాలన్నారు. పాలిథిన్ కవర్లను ఉపయోగించడం వల్ల క్యాన్సర్ వంటి మహమ్మారి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున వాటిని పూర్తిగా నిషేధించాలన్నారు. తోపుడు బండ్లు నిలిపే చోట పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, మెప్మా పీడీ కర్ణాకర్, మహబూబ్‌నగర్ మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఫుడ్ కంట్రోల్ అధికారులు జోతిర్మయి, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 11: ఆలయంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రతీ ఉద్యోగి సమయపాలన పాటించాలని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రత్యేక పర్యవేక్షణాధికారి డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి సూచించారు. దేవస్థాన ఈవో కార్యాలయంలో బుధవారం అన్ని విభాగాల పనితీరుపై రికార్డుల ఆధారంగా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఉద్యోగుల హాజరు నమోదు కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్‌ను విధిగా వాడాలన్నారు. తొలుత సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎంతమంది వారు ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తారో తెలుసుకున్నారు. అతిథి గృహాల్లో వృథాగా పడి ఉన్న ఫర్నీచర్‌ను వినియోగంలోకి తేవాలని, అదేవిధంగా గదుల నిర్వహణ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు. ఎవరి జోక్యంతో నిమిత్తం లేకుండా ఆలయ నిర్వహణలో శాఖాపరమైన మార్గదర్శకాలనే పాటించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దవూర, సెప్టెంబరు 11: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మండలంలోని పోతునూరి ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయం, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీని పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రాంనాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కలకొండ లక్ష్మి, రామ్మూర్తి, లావణ్య, అంజుమ్, ధర్మారెడ్డి, ఎఫ్‌ఏ ఎల్లయ్య, మదన్‌జీ పాల్గొన్నారు.

చెరువుకు నీళ్లు అందించడంపై హర్షం

చిట్యాల, సెప్టెంబరు 11: చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో గల మహాలింగం చెరువుకు ధర్మారెడ్డి కాల్వ ద్వారా నీళ్లు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే వేముల వీరేశంనకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వీరేశం చిత్రపటానికి బుధవారం ఆ గ్రామ రైతులు క్షీరాభిషేకం చేశారు. చెరువులోకి నీళ్లు రావడానికి ఎమ్మెల్యే తన సొంత నిధులతో పనులు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు గుండాల యాదయ్య, కన్నెబోయిన కృష్ణ, కన్నెబోయిన మల్లేష్, బొబ్బల రాజిరెడ్డి, సైదిరెడ్డి, కన్నెబోయిన చిన్నకృష్ణ, రెమిడాల సత్తయ్య, మల్లెబోయిన మల్లేష్, దాదె ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి : ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, సెప్టెంబరు 11: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బీంరెడ్డి ఇందిరమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత బీంరెడ్డి రాంరెడ్డి సతీమణి ఇందిరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సామేల్ ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, నాయకులు గన్నపురెడ్డి బిక్షం రెడ్డి, శానాల యుగేందర్ రెడ్డి, నూక భద్రయ్య, లోకసాని రంగారెడ్డి, మంగదుడ్ల శ్రీనివాస్, దేవరకొండ జయరాజ్, పల్స సైదులు, రవీందర్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నార్కట్‌పల్లి, కొండమల్లేపల్లి, సెప్టెంబరు 11: మండలంలోని అమ్మనబోలు శివారులో ఉన్న మూసీ వాగు వద్ద వినాయక నిమజ్జన ప్రదేశాన్ని అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ప్రమాదానికి తావులేకుండా నిమజ్జనం చేయగలిగే ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్, ఎస్‌ఐ క్రాంతికుమార్, కార్యదర్శి అలేందర్‌రెడ్డి ఉన్నారు.

● కొండమల్లేపల్లి మండలంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి పెండ్లిపాకల చెరువును ఎంపీడీవో రాంరెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ రామ్మూర్తితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పెండ్లిపాకల చెరువు అనుకూలంగా లేదని అధికారులు తేల్చారు.

సాయుధ పోరాటానికి గుండ్రాంపల్లి సజీవ సాక్ష్యం

చిట్యాలరూరల్, సెప్టెంబరు 11: నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి గుండ్రాంపల్లి సజీవ సాక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో బుధవారం సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాలను ఆయన ప్రారంభించారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం, రజాకార్ల అరాచకపాలనను వీరోచిత పోరాటాలు చేసి ప్రజలకు విముక్తిని కల్పించడంలో కమ్యూనిస్టులు కీలక భూమికను పోషించినట్లు తెలిపారు. ఆనాడు గుండ్రాంపల్లి, భైరాన్‌పల్లి, కడివెండి గ్రామాల్లో చరిత్రాత్మకమైన పోరాటాలు నిర్వహించారన్నారు. రజాకార్ల దాడుల్లో వారికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని వేలాది మందిని కిరాతకంగా హతమార్చారని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి విద్యార్థులకు, భవిష్యత్తు తరాలకు తెలిసేలా పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లొడంగి శ్రవణ్‌కుమార్, అంజిచారి, పబ్బు వీరస్వామి, బల్గూరి నర్సింహ, టి. వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, సల్వరాజు రామలింగయ్య, చలం పాండురంగారావు, సైదులు, అక్బర్, శంకర్, శ్రీనివాస్, సతీష్, చలపతి, సత్యం పాల్గొన్నారు.

చిత్తలూరులో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

శాలిగౌరారం, సెప్టెంబరు 11: మండలంలోని చిత్తలూరులో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన బాసాని శ్రీనివాస్ ఎద్దు వంగమర్తికి వెళ్లే దారిలో కాటమయ్య గుడి వద్ద మేత మేస్తుండగా తెగిపడిన కరెంట్ తీగలు ఎద్దుకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60వేల వరకు ఉంటుందని బాధితుడు శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఆర్‌జీఈఏఎస్ అధ్యక్షుడు మరియదాసు మృతి

నకిరేకల్, సెప్టెంబరు 11: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నకిరేకల్ శాఖ అధ్యక్షుడు పసల మరియదాసు(70) బుధవారం మధ్యాహ్నం గుండెపోటుకు గురై నకిరేకల్‌లోని స్వగృహంలో మృతి చెందారు. గత పదేళ్లుగా సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తూ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ముందున్నారు. ఆయన మృతదేహాన్ని సంఘం జిల్లా కార్యదర్శి బాదిని లింగయ్య, శివకోటి ఆంజనేయులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎన్ రామ్మోహన్‌రావు, కార్యదర్శి సూర్యచందర్‌రావు, బిక్షంరెడ్డి, పోతుల వెంకటనారాయణ, రామలింగయ్య సందర్శించి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

త్రిపురారం సెప్టెంబరు 11: త్రిపురారం మండలంలోని కంపసాగర్ మోడల్ స్కూల్‌లో బుధవారం ఎన్‌సీసీ ప్రోగ్రాంని ఆర్మీ కమాండ్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఎస్‌ఎం మాధవరావు, శుబేదార్, జగన్నాథం, హరిమిత్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశ భక్తి, దేశ రక్షణ లక్షణాలు పెంపొందించడానికి ఎన్‌సీసీ దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మల, ఎన్‌సీసీ ఏఎన్‌వో రవి పాల్గొన్నారు.

టీపీసీసీ మహేష్‌గౌడ్‌ను కలిసిన కైలాష్‌నేత

మునుగోడు, సెప్టెంబరు 11: మునుగోడుకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత టీపీసీసీ నూతన అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

చిట్యాల: వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలకు పెంచాలని సీనియర్ సిటిజన్స్ మండల అధ్యక్షుడు పానుగుల్ల అచ్చాలు డిమాండ్ చేశారు. చిట్యాలలో నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛన్‌ను పెంచాలని కోరారు. సమావేశంలో నాతి ముత్తిలింగం, జెల్లా సత్తయ్య, సాయిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఆనందం వెంకటేశం పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కోదాడ - జడ్చర్ల జాతీయ రహదారిపై మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లిగ్రామ సమీపంలో పెండ్లిపాకల ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు ఎస్‌ఐ రామ్మూర్తి వేగ నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండ్లిపాకల ఎక్స్‌రోడ్డు వద్ద ప్రమాదాల నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు.

చింతపల్లి: సమాజంలోని ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు గోవింద్ యాదగిరి అన్నారు. చింతపల్లి బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథునికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

హాలియా: ఖాతాదారుల సంక్షేమం, వివిధ రకాల సేవలను అందించడానికి బ్యాంకు కృషి చేస్తుందని పోచంపల్లి బ్యాంకు మేనేజర్ కేవీఎస్ కుమార్ అన్నారు. చనిపోయిన ఖాతాదారునికి రూ.లక్ష చెక్కును అందజేశారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జంగయ్య, బ్యాంకు సిబ్బంది చారి, రవీందర్‌రెడ్డి, షాహీన్ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని చిన్నకాపర్తికి చెందిన వడ్డెపల్లి సైదులు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ పరామర్శించారు. మహేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆర్థికసాయం అందజేశారు.

నల్లగొండరూరల్: ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో శౌర్య యాత్రను సెప్టెంబరు 1 నుంచి 17వ తేదీ వరకు జరిగే సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని అప్పాజిపేటలో నిర్వహించే శౌర్యయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నలపరాజు సైదులు. పోలే సత్యనారాయణ, రవీందర్‌కుమార్ లింగయ్య నరేష్ పాల్గొన్నారు

తిరుమలగిరి(సాగర్): రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు ద్వారా నిర్వహిస్తున్న సర్వే వల్ల అర్హులైన రైతులకు న్యాయం జరుగుతుందని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మెరావత్ మునినాయక్ అన్నారు. కొన్నేళ్లుగా చింతలపాలెం రెవెన్యూ శివారులోని కాందిశీకుల భూములు సాగు చేస్తున్నా రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందలేకపోయామన్నారు. పైలట్ ప్రాజెక్టు వల్ల ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

పెద్దవూర: టీపీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా దండ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శిగ మహేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.

మునుగోడు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద తెలిపారు. గ్రామాల్లో ప్రధానంగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాలు, వీధుల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. రోగాల బారిన పడకుండా అవగాహనతో ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

నార్కట్‌పల్లి: చిన్నారి కిడ్నీ ఆపరేషన్‌కు ఆపద్బాంధవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయాన్ని ఎస్‌ఐ క్రాంతికుమార్ చేతుల మీదుగా అందజేశారు. నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన కల్లేపల్లి దశరథ రాములు కుమార్తె హిరణ్యశ్రీ అనే రెండేళ్ల చిన్నారికి కిడ్నీ వద్ద గడ్డ అయింది. వైద్యులను సంప్రదించగా అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. దీంతో దశరథ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఆపద్బాంధవ్ సంస్థ రూ.20వేలు తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్, సభ్యులు పొట్టపంగ గణేష్, దూదిమెట్ల సాయి, సురేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ సెల్ నాయకులు మంత్రి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి, మండల అధ్యక్షుడు గద్దపాటి రమేష్, మేడి శ్రీను, మహేష్ ఉన్నారు.

కట్టంగూరు: విద్యార్థులు క్రీడల్లో రాణించి తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని ఎంఈవో మేక నాగయ్య అన్నారు. కట్టంగూరులోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పాఠశాలల క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో మండల మానిటరింగ్ నోడల్ అధికారి అంబటి అంజయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, పుల్లయ్య, మాణిక్యం, శ్రీనివాస్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: బీసీ కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రంగు బాల లక్ష్మిని నియమించడంపై గౌడ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు రంగు ముత్యంరాజుగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆమె ఓయూ ఉన్నత విద్యను అభ్యసించి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఆమె సేవలను గుర్తించిన అధిష్ఠానం బీసీ కమిషన్ సభ్యుడిగా నియమించడం సంతోషించదగిన విషయమని అన్నారు.

గట్టుప్పల్: మండల పరిధిలోని వెలమకన్నె గ్రామంలో లారీ డ్రైవర్ కొంక రమేష్ ఇటీవల మృతి చెందడంతో అతని పిల్లలు అనాథలయ్యారు. దీంతో గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ లారీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రావుల ఎల్లప్ప రూ.1లక్ష అందజేశారు.

కనగల్: కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పొట్టిపాక మహేందర్, దాసరి సురేష్, ప్రధానకార్యదర్శి కిన్నెరస్వామి, సహాయకార్యదర్శిగా అశోక్‌ను ఎంపిక చేశారు.